TGTEL/26/A4015

తెలంగాణ మంజీరా

సామాన్యుని చేతిలో అక్షర అస్త్రం తెలంగాణ మంజీరా

హైదరాబాద్ 02 ఎడిటర్ : సత్యనారాయణ 06 మంగళవారం అక్టోబర్ 2026 పేజీలు 4 సంపుటి:01 సంచిక : 150 తెలుగువారి పత్రిక..... మీ కోసం

సీఎం రేవంత్, నటిపై అసభ్య పోస్టులు

- సీఎం రేవంత్, నటి సురేఖావాణిపై అసభ్యకర పోస్ట్
- 'డిగ్‌టీవీ తెలుగు' ప్యారడీ ఎక్స్ ఖాతాపై కేసు
- సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నేత
- సీఎం ప్రతిష్ఠకు, నటి గౌరవానికి భంగం కలిగించేలా పోస్ట్
- కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు.

2 లో

సూపర్ ఇంటెలిజెన్స్ ఫోర్స్‌ను ప్రకటించిన ట్రంప్

తెలంగాణ మంజీరా న్యూస్ :

న్యూయార్క్: కృత్రిమ మేధపై విధానాలను నిర్ణయించేందుకు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ (ట్రంఎ) ఓ టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేశారు. దానికి సూపర్ ఇంటెలిజెన్స్ ఫోర్స్ అని పేరు పెట్టారు. ఆదివారం తన సోషల్ మీడియాలో ఈ విషయాన్ని ఆయన ప్రకటించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ భద్రతపై ఇటీవల ప్రపంచవ్యాప్తంగా చర్చలు జరుగుతున్న నేపథ్యంలో ట్రంప్ ఈ ప్రకటన చేయడం గమనార్హం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ స్థానం తమ ప్రభుత్వం సూపర్ ఇంటెలిజెన్స్ వినియోగిస్తుందని ట్రంప్ పేర్కొన్నారు. నేషనల్ ఇంటెలిజెన్స్ డైరక్టర్ జే క్లేటన్ ఆ బృందానికి నాయకత్వం వహించనున్నట్లు చెప్పారు.అన్ని ప్రభుత్వ సంస్థలు, ప్రజా ప్రయోజన గ్రూపులు, మౌళికరూపకర్తలు, ఏఐ కంపెనీల సహకారంతో సూపర్ ఇంటెలిజెన్స్ ఫోర్స్ పనిచేస్తుందని ట్రంప్ తెలిపారు. ఎస్ఐఎఫ్ తన నివేదికను త్రివిధ దళాలతో పాటు దేశాధ్యక్షుడికి సమర్పిస్తుందనన్నారు. సూపర్ ఇంటెలిజెన్స్‌లో అమెరికా లీడింగ్‌లో ఉండాలన్న ఉద్దేశంతో ఆ దళాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. అమెరికా ప్రజల ప్రయోజనాలను రక్షిస్తామని, అలాగే దేశ ప్రజల జీవితాలను మెరుగుపరుస్తామన్నారు.ఏఐ ఫోర్స్‌ను క్రియేట్ చేయనున్నట్లు గత నెలలో ట్రంప్ పేర్కొన్న విషయం తెలిసిందే. అయితే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను కాస్త.. సూపర్ ఇంటెలిజెన్స్‌గా మార్చేశారు.

పవన్ కల్యాణ్ ఆదేశాలతో ఇంద్రకీలాద్రిపై

ప్రధాని మోదీ పేరిట పూజలు

- మోదీ 25 ఏళ్ల ప్రజా ప్రస్థానం పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ కార్యక్రమం
- పవన్ కల్యాణ్ ఆదేశాలతో ఎంపీ లింగమనేని రమేశ్ పూజల నిర్వహణ
- అమ్మవారికి విశిష్టమైన ఖడ్గమాల అర్చన జరపనున్న ఎంపీ
- ప్రధానికి ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు కలగాలని ఆకాంక్ష

తెలంగాణ మంజీరా న్యూస్ :

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంటున్న చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని విజయవాడ ఇంద్రకీలాద్రిపై ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అక్టోబర్ 7వ తేదీన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో ప్రధాని మోదీ పేరిట ఈ పూజా కార్యక్రమాలను చేపట్టనున్నారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు రాజ్యసభ సభ్యులు లింగమనేని రమేశ్ .

మిగతా 2 లో

రక్షకులే రాక్షసుల్లా మహిళలపై అరాచకాలకు పాల్పడుతున్నారని

కాంగ్రెస్ అగ్రనేత

రాహుల్‌గాంధీ



తెలంగాణ మంజీరా న్యూస్ :

ప్రశ్నించే మహిళలను చూసి కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. మహిళలను అణచివేసే ధోరణి ఢిల్లీలో స్పష్టంగా కనిపిస్తోందని ఆయన అన్నారు. ఢిల్లీ పోలీసులు ఇటీవల మహిళలపై దాడులు, దురుసు ప్రవర్తనకు పాల్పడ్డారనే ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో రాహుల్ తీవ్ర విమర్శలు చేశారు.బాధితులకు న్యాయం చేయాలని రాహుల్‌గాంధీ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఇటీవల జర్నలిస్టులు షహీన్ ఖాన్, నఫీసా ఖాన్‌లతో జరిపిన సంభాషణకు సంబంధించిన వీడియోను ఆయన 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు. పోలీసులు దురుసుగా ప్రవర్తించారని జర్నలిస్టులు తనతో చెప్పి ఆవేదన వ్యక్తంచేశారని రాహుల్ తెలిపారు.

మిగతా 2 లో

ఫ్యూచర్ సిటీలో విదేశీ వర్సిటీల క్యాంపస్‌లు..

ప్రత్యేక పాలసీకి తెలంగాణ సర్కార్ ప్లాన్

తెలంగాణ మంజీరా న్యూస్ :

అంతర్జాతీయ స్థాయి విద్యా సంస్థల ఏర్పాటుకు తెలంగాణ కీలక చర్యలుఫ్యూచర్ సిటీలో ప్రముఖ విదేశీ యూనివర్సిటీల క్యాంపస్‌లు ఏర్పాటుకు ప్రత్యేక పాలసీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశాలు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచన 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్'పైనా సమీక్ష తెలంగాణలో అంతర్జాతీయ స్థాయి విద్యా సంస్థలను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపడుతోంది. ఫ్యూ

మిగతా 2 లో

మీ టైమ్ పాస్ కోసం నా పేరు వాడుకోవద్దు..

నాకు పదవులపై వ్యామోహం లేదు బండ్ల గణేశ్

- తన పేరును వాడుకుని ఇబ్బంది పెట్టొద్దని కోరిన బండ్ల గణేశ్
- తనకు పదవులు, హోదాలపై ఎలాంటి ఆశ లేదని వెల్లడి
- మీ టైమ్‌పాస్ కోసం నా జీవితంతో ఆడుకోవద్దంటూ విజ్ఞప్తి
- చేతులెత్తి వేడుకుంటున్నానంటూ సోషల్ మీడియాలో పోస్ట్

తెలంగాణ మంజీరా న్యూస్ :

ప్రముఖ సినీ నిర్మాత, నటుడు బండ్ల గణేశ్ సోషల్ మీడియా వేదికగా తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తన పేరును అనవసర ప్రచారాలకు, చర్చలకు వాడుకోవద్దని, తన జీవితానికి అన్యాయం చేయొద్దని ఆయన చేతులెత్తి వేడుకున్నారు. ఈ మేరకు సోమవారం ఆయన చేసిన ట్వీట్ ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశంగా మారింది.తనకు ఎలాంటి పదవులు, హోదాలపైనా ఆసక్తి లేదని .

మిగతా 2 లో

'బీసీ సీఎం ప్రకటన కాంగ్రెస్ మొక్కుబడి మాటే'..

మహేష్‌గౌడ్ వ్యాఖ్యలపై దూదిమెట్ల విమర్శలు

తెలంగాణ మంజీరా న్యూస్ :

రాష్ట్రంలో బీసీ ముఖ్యమంత్రి వస్తారని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్ చేసిన ప్రకటన హాస్యాస్పదంగా ఉందని బీఆర్ఎస్ నేత, మాజీ కార్పొరేషన్ చైర్మన్ దూదిమెట్ల బాలరాజ్‌యాదవ్ విమర్శించారు. రానున్న ఎన్నికల్లో బీసీ ఓట్లను ఆకర్షించేందుకే కాంగ్రెస్ ఈ ప్రకటన చేశారని ఆరోపించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు .2034 వరకు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని రేవంత్ రెడ్డి ఇప్పటికే ప్రకటించుకున్నారని బాలరాజ్‌యాదవ్ గుర్తుచేశారు. అలాంటప్పుడు బీసీ సీఎం వస్తారని మహేష్‌గౌడ్ చెప్పడం కేవలం మొక్కుబడి ప్రకటనేనని అన్నారు. చేవెళ్లలో కాంగ్రెస్ ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌కు 36 నెలలు పూర్తయినా అందులోని హామీల్లో ఎన్ని అమలు చేశారో .

మిగతా 2 లో

సీఎం రేవంత్, నటిపై అసభ్య పోస్టులు

మొదటిపేజీ తరువాయి

తెలంగాణ మంజీరా న్యూస్ :

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సినీ నటి సురేఖావాణిని కించపరిచేలా సోషల్ మీడియాలో పెట్టిన ఓ పోస్టు తీవ్ర వివాదాస్పదమైంది. ఈ వ్యవహారంపై టీపీసీసీ సోషల్ మీడియా విభాగం రాష్ట్ర కార్యదర్శి, న్యాయవాది కైలాశ్ సజ్జన్ హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.'డిగ్‌టీవీ తెలుగు (డిగ్‌టీవీ ప్యారడీ)' పేరుతో ఉన్న ఓ ఎక్స్ ఖాతాలో సీఎం రేవంత్ రెడ్డి, నటి సురేఖావాణి చిత్రాలను మార్ఫింగ్ చేసి, అసభ్యకరమైన వ్యాఖ్యలతో పోస్ట్ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ పోస్ట్ ఉద్దేశపూర్వకంగా ముఖ్యమంత్రి వ్యక్తిగత ప్రతిష్ఠను దెబ్బతీయడంతో పాటు, ప్రభుత్వంపై ప్రజల్లో ద్వేషాన్ని రెచ్చగొట్టేలా ఉందని ఆరోపించారు.అలాగే ఒక మహిళా నటి గౌరవానికి భంగం కలిగించేలా ఈ చర్యకు పాల్పడ్డారని కైలాశ్ సజ్జన్ తన ఫిర్యాదులో స్పష్టం చేశారు. సీఎంను అవమానించడంతో పాటు, నటిని కించపరిచేలా ఉన్న ఈ పోస్టుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.ఫిర్యాదు స్వీకరించిన నగర సైబర్ క్రైమ్ పోలీసులు సంబంధిత ఎక్స్ ఖాతా నిర్వాహకులపై కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై దర్యాప్తు ప్రారంభిం.

పవన్ కల్యాణ్ ఆదేశాలతో ఇంద్రకీలాద్రిపై

మొదటిపేజీ తరువాయి

ఈ పూజలను నిర్వహిస్తున్నారు.2001లో గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రధాని మోదీ ప్రజా ప్రస్థానం ప్రారంభమైంది. అప్పటి నుంచి 2014లో దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టి, 25 ఏళ్లుగా తన సేవలను దిగ్విజయంగా కొనసాగిస్తున్నారు. ఈ మైలురాయిని పురస్కరించుకుని, ప్రధాని మోదీకి అమ్మవారి సంపూర్ణ ఆశీస్సులు లభించాలని, ఆయనకు ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు ప్రసాదించాలని ఆకాంక్షిస్తూ ఈ పూజలు జరపనున్నారు. దేశాన్ని 'వికసిత్ భారత్' లక్ష్యం వైపు నడిపిస్తున్న ఆయన నాయకత్వం మరింత బలోపేతం కావాలన్నది ఈ పూజల ముఖ్య ఉద్దేశం.ఈ సందర్భంగా అక్టోబర్ 7వ తేదీ తెల్లవారుజామున బ్రహ్మ ముహూర్తంలో అమ్మవారి అంతరాలయంలో అత్యంత విశిష్టమైన 'ఖడ్గమాల అర్చన'ను ప్రధాని పేరిట జరపనున్నారు. జగద్గురువు ఆది శంకరాచార్యులు ఇంద్రకీలాద్రిపై ప్రతిష్టించిన శ్రీచక్రానికి ఖడ్గమాల స్తోత్రంతో పూజలు నిర్వహిస్తే అమ్మవారి అనుగ్రహంతో పాటు ఆధ్యాత్మిక శక్తి, రక్షణ, శాంతి, సంకల్పసిద్ధి కలుగుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం.ప్రధాని మోదీ నిరంతర దేశ సేవకు కనకదుర్గమ్మ ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని, ఆయన నాయకత్వంలో భారతదేశం మరింత సుసంపన్నమైన, ఆత్మనిర్భర దేశంగా ఎదగాలన్న సంకల్పంతో ఎంపీ లింగమనేని రమేశ్ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ పూజల ద్వారా ప్రధానికి సంపూర్ణ ఆరోగ్యం, శక్తి సామర్థ్యాలు లభించాలని ఆకాంక్షించారు.

ఫ్యూచర్ సిటీలో విదేశీ వర్సిటీల క్యాంపస్‌లు..

మొదటిపేజీ తరువాయి

పాలసీ రూపొందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. తెలంగాణను అంతర్జాతీయ విద్యా కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా చర్యలు వేగవంతం చేయాలని సూచించారు.ఇప్పటికే యూనివర్సిటీ ఆఫ్ లండన్, యూనివర్సిటీ ఆఫ్ బర్మింగ్‌హామ్‌తో పాటు మరో నాలుగు అంతర్జాతీయ యూనివర్సిటీలు ఫ్యూచర్ సిటీలో క్యాంపస్‌లు ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపినట్లు అధికారులు సీఎస్‌కు తెలిపారు.విదేశీ వర్సిటీలను ఆహ్వానించడం, అవసరమైన మౌలిక వసతులు కల్పించడం, పెట్టుబడులకు అవకాశం కల్పించడం, అనుమతులు సులభతరం చేయడం, విద్యా కార్యక్రమాల నిర్వహణ వంటి అంశాలను పాలసీలో చేర్చాలని సంజయ్ జాజు సూచించారు. తెలంగాణ విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.ప్రతిపాదిత వర్సిటీల ప్రతినిధులతో చర్చలు జరిపి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. త్వరలో జరగనున్న గ్లోబల్ సమ్మిట్ నాటికి ఈ ప్రణాళిక సిద్ధంగా ఉండాలని సూచించారు.ఇదే సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్మిస్తున్న 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్'పైనా సమీక్షించారు. రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో దశలవారీగా ఈ పాఠశాలలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2027 డిసెంబర్ నాటికి 67 పాఠశాలలను పూర్తి చేయాలని, 2028 జూన్ నాటికి ఈ సంఖ్యను 87కి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.ఒక్కో పాఠశాలను సుమారు 26 ఎకరాల్లో నిర్మించనున్నారు. క్రీడా మైదానాలు, హాస్టళ్లు, సిబ్బంది క్వార్టర్లు, ఆధునిక వంటశాలలు, డిజిటల్ తరగతి గదుల వంటి సదుపాయాలు కల్పించనున్నారు. నిర్మాణ పనులను క్రమం తప్పకుండా సమీక్షించి, నాణ్యతతో నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సీఎస్ ఆదేశించారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తా నూతన మండల అధ్యక్షుడు కేధార్ నాథ్ పాటిల్

రాయికోడ్, తెలంగాణ మంజీరా న్యూస్ :

మండల నాయకుల, ప్రజాప్రతినిధులు,పెద్దలు, కార్యకర్తల సహకారంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలను గడపగడపకు తీసుకెళ్తు కాంగ్రెస్ పార్టీ నీ అన్ని విధాలుగా బలోపేతానికి కృషి చేస్తానని రాయికోడ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పి.కేదారినాథ్ పాటిల్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గొల్ల ఆంజయ్య ఆధ్వర్యంలో సోమవారం నల్లంపల్లి చౌరస్తాలోని పట్లోళ్ల ఫంక్షన్ హాల్ లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ మీడియా సమావేశంలో అధ్యక్షుడు పట్లోళ్ల కేదారినాథ్ పాటిల్ మాట్లాడుతూ తమపై నమ్మకంతో మండలాధ్యక్షుడిగా నియమించిన కాంగ్రెస్ పార్టీ అధిష్టానంకు,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి,మంత్రి దామోదర రాజనర్సింహ కు,జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్,టిపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కు,డీసీసీబీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి కి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి. ఆంజయ్య కుదనాకు మండలాధ్యక్ష పదవీ రావడానికి సపోర్ట్ చేసిన మండల నాయకులు సిద్దన్న పాటిల్,బస్వరాజ్ పాటిల్,ఇతర నాయకులు, ప్రజాప్రతినిధులు,పెద్దలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ చిన్న పెద్ద అని తేడా లేకుండా అందరిని కలుపుకుంటూ,అందరి సలహాలు సూచనలతో ముందుకు వెళ్తానని తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి.ఆంజయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని పార్టీ కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ప్రతిఒక్కరిని అధిష్టానం గుర్తించి సరైన సమయంలో మంచి పదవులు కట్టబెడుతుందని కావున అందరూ సమన్వయం పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడికి శాలువలతో సన్మానించారు అలాగే ఇప్పటివరకు రాయికోడ్ మండలాధ్యక్షుడిగా పనిచేసిన బాలాజీ నర్సింలును సన్మానించి ఘనంగా వీడుకోలు పలికారు.

తెలంగాణను గుడిసెలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం

అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు - మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

తెలంగాణ మంజీరా న్యూస్ నిర్మల్

రాష్ట్రంలోని అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు అందించి తెలంగాణను గుడిసెలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో చేపట్టిన సమగ్ర భూ సర్వేను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్మల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్ర ఎక్సైజ్, సాంస్కృతిక శాఖ మంత్రి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. సమీక్ష అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

72--73 వేల గుడిసెవాసులకు ఇందిరమ్మ ఇళ్లు

రాష్ట్రవ్యాప్తంగా గుడిసెల్లో నివసిస్తున్న సుమారు 72 వేల నుంచి 73 వేల మంది పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందని మంత్రి తెలిపారు. ఇప్పటికే తొలి దశలో 4.50 లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టగా, రెండో దశలో మరో రెండు లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణానికి చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు.ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక స్థోమత లేని లబ్ధిదారులకు మహిళా సంఘాల ద్వారా రుణాలు అందించి నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అటవీ సంబంధిత సమస్యల కారణంగా ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోకుండా అధికారులు చొరవ తీసుకుని పరిష్కరించాలని సూచించారు. అవసరమైతే రాష్ట్రస్థాయిలో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించి సమస్యలను పరిష్కరిస్తామని స్పష్టం చేశారు.

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సమగ్ర భూ సర్వే చేపట్టిందని మంత్రి పొంగులేటి తెలిపారు. సుమారు 125 ఏళ్ల క్రితం భూముల సర్వే జరిగిందని, ప్రస్తుతం వచ్చే ఏడాదిన్నరలో రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో భూ సర్వే పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.మనిషికి ఆధార్ ఉన్నట్లే ప్రతి భూ కమతానికి 'భూధార్' రూపొందించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. సమగ్ర భూ సర్వేతో భవిష్యత్తులో భూ వివాదాలు తలెత్తకుండా చూడవచ్చని పేర్కొన్నారు. సర్వే ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.సర్వేను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అదనపు సామగ్రిని సమకూరుస్తామని తెలిపారు. యువ అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలని సూచించారు. భూ సర్వేలో పనిచేయడం ద్వారా అధికారులకు క్షేత్రస్థాయి పరిపాలనపై అవగాహన పెరగడంతో పాటు భవిష్యత్ సేవలకు ఉపయోగపడే విలువైన అనుభవం లభిస్తుందని అన్నారు.

ఉమ్మడి ఆదిలాబాద్‌పై ప్రత్యేక దృష్టి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల్లో భూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. గిరిజన ప్రాంతాల్లో రెవెన్యూ, అటవీ శాఖలకు సంబంధించిన సమస్యలను పరస్పర సమన్వయంతో పరిష్కరించాలని సూచించారు.ప్రతి రెవెన్యూ గ్రామంలో దశలవారీగా భూ సర్వే నిర్వహించి, ప్రతి భూ కమతానికి ల్యాండ్ పార్సెల్ మ్యాపింగ్ (ఎల్‌పీఎం) నంబర్ కేటాయించే ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. భూములకు సంబంధించిన సమగ్ర వివరాలను నమోదు చేసి, భూ హక్కులకు భరోసా కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో ఉండాలి:

మంత్రి జూపల్లి

అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని రాష్ట్ర ఎక్సైజ్, సాంస్కృతిక శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ సమర్థవంతంగా అందేలా అధికారులు పనిచేయాలని సూచించారు.ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా పరిపాలన సాగాలని, సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా అధికారులు పనిచేయాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల సమస్యల పరిష్కారానికి బలమైన సమన్వయ వ్యవస్థను ఏర్పాటు చేసుకుని పనిచేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి అటవీ సమస్యలు తమ దృష్టికి వస్తున్నాయని, సంబంధిత అధికారులు తమ పరిధిలోని సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపాలని అన్నారు. భూ సమస్యల పరిష్కారానికి భూ సర్వే ఒక గొప్ప అవకాశమని పేర్కొన్నారు. గ్రామ సభలు నిర్వహించి ప్రజలకు సర్వే ప్రక్రియపై అవగాహన కల్పించాలని, నిర్దేశిత గడువులోగా సర్వేను పకడ్బందీగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ లోకేష్‌కుమార్, రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్‌గాంధీ హనుమంతు, గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి వి.పి.గౌతమ్, నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ హరిత, ఎమ్మెల్సీ దండే విఠల్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, ఐటీడీఏ పీవో మంద మకరందు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల అదనపు కలెక్టర్లు, సబ్ కలెక్టర్లు, రెవెన్యూ, గృహ నిర్మాణ, అటవీ శాఖల అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వరాహి బాంకెట్ హాల్ ప్రారంభం ప్రముఖులతో కలిసి పాల్గొన్న మాద్రి పృథ్వీరాజ్

పటాన్ చెరు, తెలంగాణ మంజీరా న్యూస్ :

పట్టణంలో మకుట అరుణ ఆర్కేడ్ కాంప్లెక్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన వరాహి బాంకెట్ హాల్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఎండిఆర్ ఫౌండేషన్ కో–ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్ పటాన్‌చెరు పట్టణ ప్రముఖులతో కలిసి పాల్గొని, వరాహి బాంకెట్ హాల్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా ప్రారంభమైన ఈ బాంకెట్ హాల్ ప్రజలకు మరింత అందుబాటులోకి వచ్చి, వివిధ శుభకార్యాలకు చక్కని వేదికగా నిలవాలని, నిర్వాహకులకు రాబోయే రోజుల్లో మరింత విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ జైపాల్, మాజీ కార్పొరేటర్ సఫాన్ దేవ్, ప్రకాష్, అమరేందర్, మతిన్, సోమశేఖర్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీ వలలో మెహదీపట్నం జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్

4 లక్షలు లంచం తీసుకుంటూ దొరికిన అధికారిణి సునీత

నిర్మాణ అనుమతుల కోసం రూ.4 లక్షలు లంచం డిమాండ్

హైదరాబాద్, అక్టోబర్ 05తెలంగాణ మంజీరా న్యూస్ :

మెహదీపట్నం జీహెచ్ఎంసీ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ సునీత రూ.4 లక్షలు లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోయింది. నిర్మాణ అనుమతులు, క్లియరెన్స్‌కు సంబంధించిన వ్యవహారంలో లంచం డిమాండ్ చేసినట్లు ఆమెపై ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఏసీబీ అధికారులు పక్కా ప్లాన్‌తో వల పన్ని పట్టుకున్నారు. జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ సూపర్ వైజర్ తులసీ రామ్ సునీత తన అధికారాన్ని దుర్వినియోగం చేయడమే కాకుండా అనుచిత లబ్ది పొందేందుకు యత్నించినందుకుగాను ఆమెపై ఏసీబీ అధికారులు చట్టపరమైన కేసులు నమోదు చేశారు. ఈ మేరకు నిందితురాలిని నాంపల్లిలోని అడిషనల్ ప్రత్యేక జడ్జి ముందు హాజరుపర్చినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ప్రస్తుతం కేసు దర్యాప్తులో ఉన్నందున భద్రతా కారణాల రీత్యా ఫిర్యాదుదారు వివరాలను వెల్లడించడం లేదని స్పష్టం చేశారు. ఇదే రోజు అంతకుముందు రంగారెడ్డి జిల్లా స్వర్ణ కుమారి ఏసీబీ వలకు చిక్కారు. ఓ ప్రైవేట్ హాస్పిటల్ కు అనుకూలంగా వ్యవహరించేందుకు రూ. 2 లక్షల లంచం డిమాండ్ చేశారు. అయితే రూ. 2 లక్షల్లో భాగంగా రూ. 1 లక్ష ఇవ్వాలని స్వర్ణకుమారి కోరినట్లు బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఈ క్రమంలో అధికారులు అప్రమత్తం అయ్యారు. మొదటగా బాధితుడు రూ. లక్షను హెల్త్ ఇన్ స్పెక్టర్ శ్రీనివాస్ కు అందజేశాడు. ఆ తర్వాత ఆ నగదును డీఎంహెచ్ఓ డ్రైవర్ కృష్ణయ్యకు ఇచ్చినట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఆ డబ్బులను కారులో పెట్టేందుకు వెళ్తున్న సమయంలో కృష్ణయ్యను పట్టుకున్నారు. ఈ మేరకు ముగ్గురినీ అదుపులోకి తీసుకున్నారు. ఇక ఈ ఘటనకు సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలోనే దర్యాప్తులో వెలుగులోకి రానున్నట్లు తెలుస్తోంది.

'బీసీ సీఎం ప్రకటన కాంగ్రెస్ మొక్కుబడి మాటే'..

మొదటిపేజీ తరువాయి

చెప్పాలని డిమాండ్ చేశారు. 200 కార్పొరేషన్ చైర్మన్ పదవులు ఇస్తామని చెప్పి కేవలం 41 పదవులను మాత్రమే బీసీలకు ఇచ్చారని ఆరోపించారు. బీసీలకు కాంగ్రెస్ తక్కువ ఇచ్చి ఎక్కువగా ప్రచారం చేసుకుంటోందని విమర్శించారు.బీసీ సీఎం కావాలంటే మెజారిటీ ఎమ్మెల్యేలు బీసీలుగా ఉండాలని బాలరాజ్‌యాదవ్ అన్నారు. నల్లగొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో కాంగ్రెస్‌కు 34 మంది ఎమ్మెల్యేలు ఉంటే వారిలో ఇద్దరే బీసీలు ఉన్నారని పేర్కొన్నారు. మొత్తం 15 మంది సభ్యులున్న మంత్రివర్గంలోనూ ఇద్దరే బీసీ మంత్రులు ఉన్నారని అన్నారు. ఇటీవల కాంగ్రెస్ ఎంపిక చేసిన ఇద్దరు రాజ్యసభ సభ్యులూ అగ్రవర్ణాలకు చెందినవారేనని, లోక్‌సభ సీట్లలోనూ బీసీలకు తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని ఆరోపించారు. కర్ణాటకలో బీసీ డిక్లరేషన్ ప్రకటించిన సిద్ధరామయ్యను సీఎం పదవి నుంచి తొలగించి ఓసీని సీఎం చేశారని ఆయన విమర్శించారు. తెలంగాణలోనూ రేవంత్‌రెడ్డి మంత్రివర్గంలోని పద్మశాలి సామాజికవర్గానికి చెందిన వ్యక్తి పదవిని తొలగించారని ఆరోపించారు.

నాకు పదవులపై వ్యామోహం లేదు బండ్ల గణేశ్

మొదటిపేజీ తరువాయి

బండ్ల గణేశ్ స్పష్టం చేశారు. "దయచేసి మీ టైమ్‌పాస్ కోసం నా పేరు వాడి, నా జీవితానికి అన్యాయం చేయొద్దని చేతులెత్తి నమస్కరిస్తున్నాను. నాకు ఎలాంటి పదవుల మీద, హోదాల మీద, మరే విషయాల మీదా ఎలాంటి వ్యామోహం కానీ, ఆశ కానీ లేదు. లేనిపోని విషయాలు మాట్లాడి నా పేరును ఉపయోగించి నాకు ఇబ్బందులు కలిగించొద్దని మనస్ఫూర్తిగా రిక్వెస్ట్ చేస్తున్నాను" అని గణేశ్ తన పోస్టులో పేర్కొన్నారు.బండ్ల గణేశ్ తాజా ట్వీట్ ఎవరిని ఉద్దేశించి చేసిందో స్పష్టత లేకపోయినప్పటికీ, సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

కరెంట్ కోతలు వద్దు... వ్యవసాయం వైపూ చూడండి

రైతు రక్షణ సమితి అధ్యక్షులు మైసయ్య

నర్సాపూర్, తెలంగాణ మంజీరా న్యూస్ :

తెలంగాణ రాష్ట్రం వర్షాలు తగ్గుముఖం పట్టడంతో రైతులు వేసిన పంట కరెంటు కోతల వల్ల వరి పంట ఎండిపోతున్నాయని పరిస్థితి వస్తుందని తెలంగాణ రైతు రక్షణ సమితి మెదక్ జిల్లా అధ్యక్షులు మొల్ల మైసయ్య యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మెదక్ జిల్లా వరి పంట ఎక్కువ పండుతాయి ఎల్లోన ప్రభావం వల్ల వర్షాలు లేకపోవడం తో కరెంటు కోతలు త్రివరంగా కోతలు ఇస్తున్నారని, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెంటనే జిల్లా కలెక్టర్ అధికారులకు ఆదేశాలిచ్చి రాష్ట్రంలో కరెంటు కోతలు లేకుండా ప్రభుత్వం చూడాలని మైసయ్య యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కరెంటు రోజుకు మూడు నాలుగు సార్లు కోతలు తీర్చడంతో సరిగా కరెంటు రావట్లేదని కోతలు లేకుండా కరెంటు రైతులకు అందించాలని రైతులు పంటలు ఎండి పై రైతులు నష్టపోతారని, రోడ్లపై రైతులు ధర్నాలు చేసే పరిస్థితి వస్తుందని మైసయ్య యాదవ్ అన్నారు. మెదక్ జిల్లాలో వరి పంటలు అక్కడక్కడ ఎండిపోవడం ప్రారంభమైందని మైసయ్య యాదవ్ అన్నారు. కరెంటు కోతలు లేకుండా ప్రభుత్వం నిరంతంగా రైతులను ఆదుకోవాలని రైతుల పక్షాన సంఘం పక్షాన ప్రభుత్వాన్ని మైసయ్య యాదవ్ డిమాండ్ చేశారు.

తెలంగాణ మంజీరా
06 మంగళవారం అక్టోబర్ 2026

ఆరుట్ల, ఫసల్ వాది, కందిలే అవుట్ల పై సంగారెడ్డి కలెక్టర్ సమక్షంలో అధికారులతో రివ్యూ సమావేశం

రివ్యూ సమావేశం లో పాల్గొన్న జగ్గారెడ్డి, నిర్మల నవంబర్ చివరికల్లా భూములు కోల్పోయిన రైతులకు

హెచ్ఎండీఏ ప్లాట్లు కేటాయించాలి రివ్యూ సమావేశం లో అధికారులకు జగ్గారెడ్డి, నిర్మల సూచన

తెలంగాణ మంజీరా న్యూస్ :

సంగారెడ్డి నియోజకవర్గ పరిధిలో గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన హెచ్ఎండీఏ ల్యాండ్ పూలింగ్ లే అవుట్లపై సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సమీక్ష సమావేశం నిర్వహించారు. హెచ్ఎండీఏ, రెవెన్యూ శాఖల అధికారులతో నిర్వహించిన ఈ సమావేశంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, నిర్మల జగ్గారెడ్డి పాల్గొన్నారు.ఆరుట్ల, ఇంద్రకరణ్, ఫసల్వాది, కంది ప్రాంతాల్లో గతంలో ల్యాండ్ పూలింగ్ ద్వారా భూములు తీసుకుని రైతులకు సర్టిఫికెట్లు ఇచ్చినా, ఇప్పటివరకు ప్లాట్ల పొజిషన్ ఇవ్వలేదని పలువురు రైతులు ఎదురుచూస్తున్న విషయాన్ని సమావేశంలో జగ్గారెడ్డి,నిర్మల ప్రస్తావించారు. ఆయా ప్రాంతాల్లో లే అవుట్ల పరిస్థితి ఏమిటి, పనులు ఎందుకు ఆలస్యమయ్యాయి, ప్రస్తుతం ఎంత మేరకు పూర్తయ్యాయనే అంశాలపై జగ్గారెడ్డి హెచ్ఎండీఏ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఆరుట్ల లే అవుట్ పరిధిలో 106 ఎకరాల 14 గుంటల్లో లే అవుట్ ప్రక్రియ పూర్తయినప్పటికీ, ఇంకా లబ్ధిదారుల జాబితా అందలేదని అధికారులు తెలిపారు.ఫసల్వాది ప్రాంతంలో భూసేకరణ ప్రక్రియ సుమారు 60 శాతం పూర్తయిందని, కొంత ప్రాంతంలో రైతుల నుంచి అభ్యంతరాలు ఉన్నాయని హెచ్ఎండీఏ అధికారులు కలెక్టర్కు వివరించారు.కంది గ్రామంలో 50 ఎకరాలకు హెచ్ఎండీఏ లే అవుట్ ప్రతిపాదించగా, ప్రస్తుతం 46 ఎకరాలు మాత్రమే అందుబాటులో ఉన్నాయని, లబ్ధిదారుల జాబితా ఇంకా పంపలేదని అధికారులు తెలిపారు. కంది లే అవుట్ పనులను ఈ నెల 10వ తేదీలోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కంది, ఫసల్వాది లే అవుట్లను కూడా త్వరితగతిన సిద్ధం చేస్తామని అధికారులు వెల్లడించారు.కంది, ఫసల్ వాది, ఆరుట్ల లే అవుట్లో నవంబర్ చివరికల్లా ప్లాట్లను కేటాయిస్తామని హెచ్ఎండీఏ అధికారులు సమావేశంలో తెలిపారు.లే అవుట్లకు సంబంధించిన మిగిలిన పనులను పూర్తి చేసి, భూములు కోల్పోయిన లబ్ధిదారులకు సాధ్యమైనంత త్వరగా ప్లాట్లు కేటాయించాలని జగ్గారెడ్డి అధికారులను కోరారు. రైతులు సంవత్సరాలుగా ఎదురుచూస్తున్నందున ప్రక్రియలో మరింత జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఇక వచ్చే నవంబర్ చివరికల్లా హెచ్ఎండీఏ లే అవుట్లలో భూములు కోల్పోయిన రైతులందరికీ ప్లాట్లు కేటాయించేలా పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. హెచ్ఎండీఏ, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేసి పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ .

సంగారెడ్డి, తెలంగాణ మంజీరా న్యూస్ :

ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి అర్హత మేరకు సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్లు సంగీత, పాండు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల సమస్యలను స్వయంగా ఆలకించిన కలెక్టర్, సంబంధిత శాఖల అధికారులకు అర్జీలను పంపించి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి నిర్ణీత సమయంలో సత్వర పరిష్కారం చూపాలన్నారు. జిల్లా ప్రజావాణి దరఖాస్తులతో పాటు పెండింగ్లో ఉన్న సీఎం ప్రజావాణి దరఖాస్తులను కూడా త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో మొత్తం 81 వినతులు అందినట్లు అధికారులు తెలిపారు. వీటిలో కలెక్టరేట్కు 53, సంగారెడ్డి డివిజన్కు 22 , నారాయణఖేడ్ డివిజన్కు 5 , జహీరాబాద్ డివిజన్కు 1 వినతి అందగా, అందోల్ డివిజన్కు ఎలాంటి వినతులు అందలేదని అధికారులు వెల్లడించారు. ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి, సమస్యకు పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ జానకిరెడ్డి, బీసీ సంక్షేమాధికారి జగదీష్, సంగారెడ్డి ఆర్డీఓ రాజేందర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్, పీడీ గృహనిర్మాణ శాఖ చలపతిరావు, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ ఎస్.బి. రామాచారి, జిల్లా సంక్షేమాధికారిణి లలిత కుమారి, అదనపు డీఆర్డీఓ బాలరాజ్తో పాటు వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు చేయూత

మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్

పటాన్ చెరు, తెలంగాణ మంజీరా న్యూస్ :

పట్టణంలోని జె.పీ కాలనీ డివిజన్ పరిధిలోని బండ్లగూడలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పాండు, సుబ్బారావు ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు ఉచిత పుస్తకాలు, పెన్సిళు ,, స్కూల్ బ్యాగులను అందజేశారు. ఈ కార్యక్రమానికి మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు పుస్తకాలు, పెన్సిళ్లు, స్కూల్ బ్యాగులను అందజేశారు. ఈ సందర్భంగా మెట్టు కుమార్ యాదవ్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు విద్యే పునాది అని, ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ విద్యార్థి చదువుకు దూరం కాకూడదన్నారు. పేద విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని ఉచితంగా అందించడం ద్వారా వారికి ఆత్మవిశ్వాసాన్ని కల్పించడంతో పాటు చదువుపై మరింత ఆసక్తిని పెంచుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల సంక్షేమం కోసం పాండు, సుబ్బారావు గారు చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని అన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ తమకు సాధ్యమైన మేరకు విద్యార్థులకు అండగా నిలిచి, వారి విద్యాభివృద్ధికి సహకరించాలని మెట్టు కుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బండ్లగూడ పట్టణ ప్రెసిడెంట్ భరత్ కుమార్, గొల్ల కృష్ణ, ప్రభాకర్, రవీంద్ర చారి, శ్రీను, కార్ రాజు, సురేందర్, అఫ్జల్, ఊర్మిల, ఆస్మా బేగం, రజిని, అమృత, పార్వతి, భూదేవి, సంగీత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీంద్ర,వలపాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చెరువులు నింపే దిశగా అధికారుల సర్వే..!

అందోల్, తెలంగాణ మంజీరా న్యూస్ :

చౌటకూర్ మండలంలోని బొమ్మారెడ్డిగూడెం గ్రామ శివారులోని చెరువులకు కెనాల్ ద్వారా నీటిని మళ్లించే దిశగా మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు ఏ.ఈ. మధుసూదన్ అధికారులు సోమవారం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ గ్రామంలోని చెరువులకు కెనాల్ ద్వారా నీటిని మళ్లించేలా చర్యలు తీసుకుంటున్న మంత్రి దామోదర్ రాజనర్సింహకు కృతజ్ఞతలు తెలిపారు. నీరు అందుబాటులోకి వస్తే గ్రామ రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బొమ్మారెడ్డిగూడెం గ్రామ అధ్యక్షుడు, రిటైర్డ్ ఎంపీడీవో హరిసింగ్ నాయక్, సీనియర్ నాయకులు కుమ్మరి సాయిలు, మేఘరాజ్ నాయక్, లక్ష్మణ్, లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి మహేష్ రాథోడ్, గణేష్ జాదవ్, కిషన్ డీలర్, చిరంజీవి, మూడు శ్రీనివాస్, శివరాం, శివ, కుమ్మరి బిచ్చపచ్చి తదితరులు పాల్గొన్నారు.

ఓటు బచావో దేశ్ బచావో

జహీరాబాద్, తెలంగాణ మంజీరా న్యూస్ :

ఎస్ఐఆర్ లో ఓట్ల చోరి ఓటు బచావో దేశ్ బచావో అంటూ రాహుల్ గాంధీ పిలుపుమేరకు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో జిల్లా సేవాదళ్ అధ్యక్షులు కర్ణం సందీప్, జిల్లా ఉపాధ్యక్షులు నర్సింలు, కార్యకర్తలతో కలిసి గాంధీ భవన్ కు తరలి వెళ్లారు. జిల్లా సేవల అధ్యక్షులు కర్ణం సందీప్ మాట్లాడుతూ ఇండియన్ ఎలక్షన్ కమిషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ మండలాల నూతన అధ్యక్షులు, ఉపాధ్యక్షులు ప్రకటించారు. జహీరాబాద్ మండల అధ్యక్షులుగా గొల్ల బీరప్ప, ఉపాధ్యక్షులుగా ప్రవీణ్ ను నియమించారు. ఝరాసంగం సంఘం మండల అధ్యక్షులుగా లక్ష్మన్న, ఉపాధ్యక్షులుగా శ్రీశైలం ను నియమించారు. కోహిర్ మండల అధ్యక్షులుగా శ్రీనివాస్, ఉపాధ్యక్షులను ప్రకటించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు మౌలానా, చెంద్రయ్య, అశోక్, శిరమణి తదితరులు పాల్గొన్నారు.

నేడు మెదక్ జిల్లాకు గవర్నర్ రాక

మెదక్, తెలంగాణ మంజీరా న్యూస్ :

మెదక్ జిల్లాలో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పర్యటన మంగళవారం మెదక్ ఐడివోసికి కు చేరుకున్నారు. 2.40 గంటలకు నషా ముక్త్ భారత్ ర్యాలీ ప్రారంభమవుతుంది. విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొననున్న మహిళా శక్తి స్టాళ్ల సందర్శనం, స్వయం సహాయక సంఘాలతో భేటీ ఐడివోసిలో నూతనంగా ఎన్నికైన రెడ్ క్రాస్ నూతన ప్రతినిధులతో సమావేశం అవుతారు. దేశంలోనే తొలిసారిగా జాతీయ రహదారి వెంట జీడిమామిడి మొక్కల పెంపకం కార్యక్రమం, పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపే లక్ష్యంగా, రామాయంపేట - సిద్దిపేట మధ్య రహదారి పక్కన వెంట 35 వేల మొక్కలు నాటే కార్యక్రమం, ఎంపీ మాధవనేని రఘునందన్ రావు ఆధ్వర్యంలో భారీ ప్లాంటేషన్, అమోఘ హోటల్ సమీపంలో స్వామి వివేకానంద విగ్రహం వద్ద మొక్కలు నాటుతున్నట్లు పేర్కొన్నారు.

ఎస్ఐఆర్లో ఓట్ల తొలగింపుపై ఇండియా కూటమి సమావేశం

సీ ఈ సి జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి

డిసిసి అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి

సంగారెడ్డి, తెలంగాణ మంజీరా న్యూస్ :

ఎస్ఐఆర్లో భాగంగా ఓట్ల తొలగింపుపై సోమవారం ఇండియా కూటమి నేతలు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొని ఓటర్ల జాబితాలో జరుగుతున్న మార్పులు, ఓట్ల తొలగింపుపై చర్చించారు. అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించకుండా చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియలో ఓట్ల తొలగింపుపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో నమ్మకం నిలబెట్టేందుకు జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని కోరారు. ఓటు హక్కును కాపాడేందుకు అన్ని రాజకీయ పార్టీలు కలిసి పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత కిషన్ సంగారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ కూన వనిత సంతోష్ సంగారెడ్డి పట్టణ అధ్యక్షుడు కిరణ్ గౌడ్, టీజేఎస్ నాయకులు తులసి రెడ్డి ఇతర పార్టీల నాయకులు పాల్గొన్నారు.

సిద్ధాపూర్ కాలనీవాసులు కలెక్టర్ కు వినతి పత్రం

సదాశివపేట, తెలంగాణ మంజీరా న్యూస్ :

పేట పట్టణ పరిధిలోని సిద్ధాపూర్ ఏడవ వార్డులో స్మశాన వాటిక స్థలం గురించి జిల్లా కలెక్టర్ కు మెమోరాండం సమర్పించడం జరిగింది.సదాశివపేటలోని సిద్ధాపూర్ 7వ వార్డు గ్రామ ప్రజలకు వార్డులో చనిపోయిన వారి అంత్యక్రియలు గౌరవప్రదంగా నిర్వహించడానికి సరైన స్థలం లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని, స్థలం లేకపోవడం వల్ల విధి లేని పరిస్థితుల్లో సొంత పొలాలో, చెండ్లలో అంత్యక్రియలు జరపాలసి వస్తుందని, కావున మాకు సరైన ప్రభుత్వ స్థలాన్ని స్మశాన వాటిక కొరకు కేటాయించగలరని కలెక్టర్ కు విన్నవించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పి. విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ సర్పంచ్ గొల్ల కృష్ణయ్య, మంగలి ఆంజనేయులు, అనంతరం గౌడ్ , మున్నూరు శేఖర్, జంబ విశ్వనాథం, జంగం శేఖర్, ఎరుకలి రాజు, ఎండి అయుబ్ పాషా, ఎండి నయుం, ఎండి ఖైరతాలి, తదితరులు పాల్గొన్నారు.

ఇర్ఫానీ దర్గా 24 వ ఉర్సు ఉత్సవాల్లో పాల్గొన్న జగ్గారెడ్డి

తెలంగాణ మంజీరా న్యూస్ :

దర్గా లో ప్రత్యేక ప్రార్థనలు అనంతరం కవ్వాలి కార్యక్రమం కు హాజరై కళాకారులకు కానుకలు అందించిన జగ్గారెడ్డిసంగారెడ్డి పట్టణ శివారులోని ఇర్ఫాని దర్గా 24వ ఉర్సు ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా ముగిశాయి. ఉర్సు ముగింపు సందర్భంగా దర్గాలో ప్రత్యేక దీపారాధన, ప్రార్థనా కార్యక్రమాలను నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి దీపాలు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం నిర్వహించిన ఖవ్వాలి కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.ఉర్సు ముగింపు కార్యక్రమానికి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి హాజరై దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దర్గాలకు కులమతాలకు అతీతంగా ప్రజలు తరలివస్తారని, ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల మధ్య సోదరభావం, ఐక్యతను మరింత పెంపొందిస్తాయని అన్నారు. అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.ఈ ఉర్సు వేడుకల్లో సంగారెడ్డి మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ అహ్మద్, కాంగ్రెస్ నాయకుడు కూన సంతోష్ కుమార్, దర్గా నిర్వాహకులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

కాకా వెంకటస్వామికి భారతరత్న ఇవ్వాలి..!

97వ జయంతిలో ఘన నివాళి

ఐఎన్టియుసి అధ్యక్షులు కొల్కూరి నర్సింహారెడ్డి

పటాన్ చెరు, తెలంగాణ మంజీరా న్యూస్ :

స్వర్గీయ మాజీ మంత్రి కాక వెంకట స్వామి 89వ జయంతిని పురస్కరించుకొని సోమవారం పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మాజీ కేంద్ర కార్మిక శాఖ మంత్రి వెంకటస్వామి 97వ జయంతి సందర్భంగా తనయుడు, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి తో కలిసి హైదరాబాద్ లోని ట్యాంక్ బండ్ పైన ఉన్న వారి కాంస్య విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించామని తెలిపారు . వెంకటస్వామి ఏడు పర్యాయాలు పార్లమెంటుకు ఎన్నికై, కేంద్ర కార్మిక శాఖ మంత్రిగా ఉన్నప్పుడు వారి చొరవతో కార్మికులకు రిటైర్మెంట్ అనంతరం పెన్షన్ పథకాన్ని తీసుకొచ్చిన ఘనత వారిదేనని అన్నారు. ఒక్క హైదరాబాద్ లోనే 75 వేల పేదలకు ఇళ్ల పట్టాలు అందించిన ఘనత వెంకటస్వామిదేనని కొనియాడారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కోటి పది లక్షల మంది కార్మికులకు వేతనాలు పెంచిన ఘనత వివేక్ వెంకటస్వామి అని అన్నారు. ధడకేంద్ర ప్రభుత్వం కాకా వెంకటస్వామి సేవలను దృష్టిలో ఉంచుకొని వారికి భారతరత్నఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. కార్మిక నాయకులు రవికుమార్, అంబేద్కర్, ప్రవీణ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

సర్కారీ బడి కోసం రూ. 3.5 కోట్లకు పైగా విరాళాలు!

ప్రైవేట్ స్కూళ్లకు పోటీగా ప్రభుత్వ బడులు

అధునాతన రీతిలో తీర్చిదిద్దడమే లక్ష్యంగా 'ప్రాజెక్ట్ 511'

హైదరాబాద్, అక్టోబర్ 05(ఆర్ఎన్ఏ):

ప్రభుత్వ పాఠశాలల మౌలిక వసతులను ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా అధునాతన రీతిలో తీర్చిదిద్దడమే లక్ష్యంగా 'ప్రాజెక్ట్ 511' చేస్తున్న కృషికి హైదరాబాద్ దాతలు అండగా నిలిచారు. హైదరాబాద్ రౌండ్ టేబుల్ 8 ఛారిటబుల్ ట్రస్ట్నేతృత్వంలో నిర్వహించిన 9వ 'ఫుడ్ ఫర్ ఛేంజ్' ఫండ్‌రైజింగ్ గాలా ఈవెంట్ అత్యంత వైభవంగా ముగిసింది. జేఆర్సీ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో నగరం నలుమూలల నుంచి ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, ప్రముఖ పారిశ్రామికవేత్తలు, నూతన స్టార్టప్ నిర్వాహకులు, సామాజిక వేత్తలు, దాతలు పాల్గొని విరాళాలు అందించారు. ఈ నిధుల సేకరణ కార్యక్రమం ద్వారా రూ.3.5 కోట్లకు పైగా విరాళాలు వసూలయ్యాయి. హైదరాబాద్‌లోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ పరిధిలో ఉన్న గౌలిదొడ్డి ఎంపీయూపీఎస్ ప్రభుత్వ పాఠశాలను రూ. 7.75 కోట్ల అంచనా వ్యయంతో సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు ఈ విరాళాలను వినియోగించనున్నారు. ఈ నూతన మోడల్ క్యాంపస్ ద్వారా సుమారు 840 మంది విద్యార్థులకు ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. నూతనంగా రూపుదిద్దుకోనున్న గౌలిదొడ్డి ప్రభుత్వ పాఠశాల క్యాంపస్‌లో 20 మోడల్ తరగతి గదులు, అత్యాధునిక లైబ్రరీ, సైన్స్ మరియు కంప్యూటర్ లాబొరేటరీలు, విశాలమైన డైనింగ్ హాల్, కిచెన్, యాంఫీ థియేటర్, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉండే ఫుట్‌బాల్ కోర్ట్ మరియు ఆహ్లాదకరమైన కోర్ట్‌యార్డ్‌లు నిర్మించనున్నారు. ఇది విద్యార్థులకు కేవలం చదువులోనే కాకుండా క్రీడలు, ఇతర సృజనాత్మక కార్యకలాపాల్లో కూడా రాణించేందుకు ఎంతగానో ఉపయోగపడనుంది. ఈ నిధుల సేకరణ సాయంత్రంలో తెలంగాణ రాష్ట్ర డీజీపీ సీ.వీ. ఆనంద్; ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఓ సలహాదారు కే. రామకృష్ణారావు, ఐఏఎస్; ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ఐఏఎస్; ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్ రావు, ఐఏఎస్; టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్, ఐఏఎస్; మరియు ఇంధన శాఖ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ, ఐఏఎస్‌లతో పాటు పలువురు కార్పొరేట్ దిగ్గజాలు, ప్రతినిధులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా 'ప్రాజెక్ట్ 511' గవర్నింగ్ కౌన్సిల్ ఛైర్మన్ హుస్సేన్ చాస్ మాట్లాడుతూ.. "సమాజానికి తిరిగి ఇచ్చే క్రమంలో హైదరాబాద్ ఎప్పుడూ ముందుంటుంది. పిల్లల భవిష్యత్తు కోసం దాతలు చూపుతున్న నిబద్ధతకు 'ఫుడ్ ఫర్ ఛేంజ్' ఒక నిదర్శనం. గౌలిదొడ్డి క్యాంపస్ ప్రాజెక్ట్ మా సంస్థ చేపట్టిన అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్టులలో ఒకటి. ఒక మంచి ఆశయం కోసం సమాజమంతా ఏకమైనప్పుడు ఏదీ అసాధ్యం కాదని రూ. 3.5 కోట్లకు పైగా వచ్చిన విరాళాలు నిరూపించాయి" అని హర్షం వ్యక్తం చేశారు. రెండు దశాబ్దాలుగా విద్యా రంగానికి సేవలు: 2003వ సంవత్సరంలో హైదరాబాద్ రౌండ్ టేబుల్ 8 ద్వారా ప్రారంభమైన 'ప్రాజెక్ట్ 511' గత 23 ఏళ్లుగా తెలంగాణవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మారుస్తోంది. ఇప్పటివరకు రాష్ట్రంలోని 1,319 ప్రభుత్వ పాఠశాలల్లో 4 లక్షల మందికి పైగా విద్యార్థులకు ఇది నేరుగా లబ్ధి చేకూర్చింది. 142 నూతన తరగతి గదులు, 797 పరిశుభ్రమైన టాయిలెట్ బ్లాక్‌లు, 310 సైన్స్ ల్యాబ్‌లు, 30,834 డ్యూయల్ డెస్క్‌లు (బెంచీలు), 718 టీచింగ్ కిట్‌లను ఈ సంస్థ పాఠశాలలకు అందించింది. అంతేకాకుండా తరగతి గదుల డిజిటలైజేషన్, స్కూల్ ఫర్నిషింగ్, ఇంగ్లీష్ లెర్నింగ్ ప్రోగ్రామ్‌ల ద్వారా నాణ్యమైన విద్యను అందిస్తోంది. గౌలిదొడ్డి మోడల్ స్కూల్ నిర్మాణంలో భాగస్వామ్యమై విరాళాలు అందించాలనుకునే వారు వెబ్‌సైట్‌ను సందర్శించి తమ వంతు సహకారాన్ని అందించవచ్చని నిర్వాహకులు కోరారు.

ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రజావాణి

జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

సంగారెడ్డి, తెలంగాణ మంజీరా న్యూస్ :

ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి చట్టపరమైన పరిష్కారం అందించేందుకు జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడిన జిల్లా ఎస్పీ, వారి సమస్యలను ఓపికగా విని ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం సంబంధిత ఎస్‌హెచ్‌ఓలతో ఫోన్ ద్వారా మాట్లాడి, ఆయా సమస్యల పరిష్కారంలో జాప్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ స్థానిక పోలీస్ స్టేషన్‌లో తమ సమస్యకు పరిష్కారం లభించని పక్షంలో ప్రజలు భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని, ఎలాంటి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా, నేరుగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి సూచించారు.

నూతన క్రిస్టియన్ సేవా సమితి అసోసియేషన్

పటాన్ చెరు, తెలంగాణ మంజీరా న్యూస్ :

క్రిస్టియన్ సేవా సమితి నూతన అసోసియేషన్ ప్రారంభోత్సవం సందర్భంగా పటాన్‌చెరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పండ్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ నాయకులు, ఎండిఆర్ ఫౌండేషన్ కో-ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్ హాజరై, నూతన అసోసియేషన్ సభ్యులకు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టి, సమాజానికి మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గూడెం మధు, మాజీ మార్కెట్ చైర్మన్ విజయ్, నరేష్, జీవన్, ఆర్తి, క్రిస్టియన్ సేవా సమితి సభ్యులు, ఎంపిఆర్ యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టం - వారోత్సవాలు ప్రారంభం

అదనపు కలెక్టర్ సంగీత

సంగారెడ్డి, తెలంగాణ మంజీరా న్యూస్ :

తెలంగాణ సమాచార కమిషన్ కార్యదర్శి ఆదేశాల మేరకు సమాచార హక్కు చట్టం--2005పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు సోమవారం నుండి 12వ తేదీ వరకు సమాచార హక్కు చట్టం ఆర్టీఐ వారోత్సవాలు --2026 నిర్వహిస్తున్నట్లు అదనపు కలెక్టర్ సంగీత తెలిపారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అధికారులతో ఆర్టీఐ వారోత్సవాల నిర్వహణపై ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం--2005పై సాధారణ ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, చట్టం ప్రకారం ప్రభుత్వ అధికారులు, సిబ్బంది నిర్వహించాల్సిన బాధ్యతలపై చైతన్యం కల్పించడం వారోత్సవాల ప్రధాన ఉద్దేశమన్నారు. జిల్లా, రెవెన్యూ డివిజన్, మండల స్థాయిలలో సంబంధిత శాఖలు, పబ్లిక్ అథారిటీస్ భాగస్వాములను చేస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఆర్టీఐ చట్టంలోని సెక్షన్ 4(1)(బి) ప్రకారం ప్రభుత్వ శాఖలు స్వచ్ఛందంగా సమాచారాన్ని వెల్లడించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ నెల 9 న రాష్ట్ర స్థాయిలో నిర్వహించే కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించేందుకు జిల్లా కేంద్రంలో అవసరమైన ఏర్పాట్లు చేయాలని, ఏ పి ఐ ఓ లు , పి ఐ ఓ లు , ఫస్ట్ అప్పీలేట్ అథారిటీ అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని ఆదేశించారు. ఆర్టీఐ వారోత్సవాలను జిల్లాలో సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో అన్నిశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు .

బీఆర్ఎస్ పార్టీలో చేరిన వెంకటాపూర్ సర్పంచ్, ఉప సర్పంచ్

నర్సాపూర్, తెలంగాణ మంజీరా న్యూస్ :

కౌడిపల్లి మండల పరిధిలోని కౌడిపల్లి మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన సర్పంచ్ లక్ష్మి కుమార్, ఉప సర్పంచ్ మౌనిక మహేష్‌తో పాటు వారి పాలకవర్గ సభ్యులు ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే వారికి బిఆర్ఎస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్థులు పాల్గొన్నారు.